

బాన్సువాడ నుంచి వేములవాడకు బస్సు సర్వీసు

బాన్సువాడ టౌన్, నవంబరు 26: బాన్సువాడ పట్టణం నుంచి వేములవాడ వరకు బస్సు సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు బాన్సువాడ నుంచి వేములవాడకు, తిరుగు ప్రయాణం వేములవాడ నుంచి మధ్యాహ్నం 2.15 ని.లకు ఉంటుందన్నారు. ఈ నెల 30 వరకు బస్సు సర్వీసు నడుపనున్నట్లు ఆమె తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



స్థానిక ఎన్నికలే లక్ష్యం

- నియోజకవర్గాల్లో తాజా పరిస్థితులపై ప్రధాన పార్టీ నేతల ఆరా
- స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా అడుగులు వేస్తున్న పార్టీలు
- హామీల అమలుపై అధికార కాంగ్రెస్ సమీక్షలు
- నెరవేరని హామీలపై ప్రజల్లోకి ప్రతిపక్షాలు
- మరోవైపు ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

కామారెడ్డి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. తుది ఓటరు జాబితాను సైతం ప్రకటించిన ఎన్నికల కమిషన్ ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించింది. రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. అందుకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటికి నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. మరో పక్షం రోజుల్లో అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలను జరిపేందుకు సిద్ధమవుతోంది. అదేవిధంగా ప్రధాన ప్రతిపక్షాలు కూడా అధికార పక్షం ఇచ్చిన హామీలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఆరోపణలు విమర్శలతో హోరెత్తిస్తున్నాయి. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రతిపక్షాలు సైతం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అధికార విపక్షాలు స్థానిక ఎన్నికల సంబరాలకు సై అంటుండడంతో గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ సెగ మెల్లగా రాజుకుంటుంది.

నెరవేర్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు

కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నందున మరో వారం రోజుల్లో అధికారిక విజయోత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన హామీలను చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విజయోత్సవాలతో ప్రజల ముందుకు వెళ్లనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కారాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. దీంతో అధికారుల బృందం గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని సక్రమంగా ఉన్న దరఖాస్తులను వెంటనే ప్రత్యేక యాప్ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల డీఎస్సీ ఫలితాలు వెల్లడించి నూతనంగా ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్, విద్యుత్ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రభుత్వపరంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన సన్న ధాన్యానికి రూ.500ల బోనస్ ప్రభుత్వం అందజేస్తోంది. వీటన్నింటిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు ప్రజాప్రతినిధులు ఆయా నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.

హామీల అమలుపై సమీక్ష

కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై సమీక్షలు ప్రారంభించింది. అత్యవసరమైన పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న కాళేశ్వరం ప్యాకేజ్ 21, 22 పనులు పూర్తి చేసేందుకు ఇటీవల నీటి పారుదలశాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు సమావేశం అయ్యారు. ఈ ప్యాకేజీ పనులు పూర్తిచేస్తే నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లాలో రైతులకు సాగునీరు అందించవచ్చని దీంతో కాంగ్రెస్ వైపు రైతులు ఉంటారనే భావనతో ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, భూపతిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని సైతం కోరారు. అదేవిధంగా కామారెడ్డి పట్టణానికి తాగునీటి సమస్య తీర్చేందుకు ఎస్ఆర్ఎస్‌పీ నుంచి గోదావరి నీటిని తరలించేందుకు పూర్తి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అధికారులను ఆదేశించారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. మంత్రివర్గ నిర్ణయంమేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదల కావాల్సి ఉంది. పేదల సొంతింటి కలను నిజంచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను తమవైపు మలుచుకునేందుకు అధికార పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

ప్రతిపక్షాల కసరత్తు

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటి మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి. అధికార పార్టీకి దీటుగా గ్రామాలు, పట్టణాల్లో పలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. బీఆర్ఎస్ ఈనెల 29న దీక్ష దివస్ పేరిట కామారెడ్డిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తోంది. తాజాగా మంగళవారం బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, సురేందర్‌లు

(మిగతా 8వ పేజీలో)

అతివేగం, అధిక లోడుతో అనర్థాలు

- పలు ప్రమాదాలకు కారణమవుతున్న టిప్పర్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

7



ధరణి ఆపరేటర్ల వెట్టి చాకిరీ

- పది నెలలు గడుస్తున్నా అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ధరణి ఆపరేటర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

7



వంతెన నిర్మాణం కలేనా?

- గత ప్రభుత్వంలో రూ.2.70 కోట్లు మంజూరు
- నిర్మాణంపై నీలినీడలు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజల వేడుకోలు

7



తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించిన వ్యక్తి కేసీఆర్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కామారెడ్డి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు ఆంధ్ర పాలకుల అరాచక పాలన నుంచి విముక్తి కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణ శివారులోని ఓ ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో దీక్ష దివస్ కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధించాలనే ఉద్దేశ్యంతో అనేక పోరాటాల అనంతరం 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో నవంబరు 29న కరీంనగర్‌కు ఆమరణ దీక్షకు బయలు దేరుతుండగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను మధ్యలోనే అరెస్టు చేసిందని అన్నారు. అప్పటి నుంచి రాష్ట్రం మొత్తం ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగి చివరకు ప్రత్యేక తెలంగాణ సాధించే వరకు కేసీఆర్ చేసిన కృషి తెలంగాణ ప్రజలు మనస్సులో నాటుకుపోయిందని అన్నారు. కేసీఆర్ ఉద్యమానికి నాంది పలికిన నవంబరు 29న దీక్ష దివస్‌గా పేర్కొంటూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యక్రమం చేపడుతుందన్నారు. కామారెడ్డి పట్టణంలో సైతం భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరులకు నివాళ్లు అర్పించడంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, బీజేపీ కబంధహస్తాల నుంచి విముక్తి కలిగిస్తుందని కాంగ్రెస్‌ది పిరికి పందల పాలన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసినందుకు అపజయోత్సవాలు జరుపుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే, సురేందర్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, ఆయా మండలాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలను విజయవంతం చేయాలి

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్నందున డిసెంబరు 1 నుంచి 9 వరకు చేపట్టనున్న ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంతంపల్లి గ్రామంలో మన ఊరిలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పౌల్ట్రీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషం గా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ స్వామి, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు అంకం రాజు, సుదర్శన్, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వ్యాపారంలో రాణించాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

లింగంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళలు వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఆయన మంగళవారం లింగంపేట మండల పరిషత్తు కార్యాలయంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాలు వ్యాపారరంగం ఎంచుకుని అనుభవం, ఆసక్తిగల వ్యాపారాన్ని నిర్వహించి ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. మహిళల అభ్యుదయం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, రుణాలు సమకూరుస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వ్యాపారాలను నిర్వహించాలని సూచించారు. మహిళా సంఘాలకు పాఠశాలల్లోని పిల్లలకు యూనిఫాంలు కుట్టే పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు నిర్వహించడం, వరి ధాన్యం కొనుగోలు చేయడం, వంటి పనులు మహిళా సంఘాలే నిర్వహిస్తున్నాయని ఆయన తెలియజేశారు. వచ్చే సీజన్ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలే ఎక్కువగా నిర్వహించాలని ఆయన సూచించారు. క్యాంటిన్, డైరీ, ఫిష్ ఫాండ్ తదితర వ్యాపారాలు కొనసాగించాలని ఆయన తెలియజేశారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకములో రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి సురెందర్, తహసీల్దార్ నరెందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఏపీఎం శ్రీనివాస్‌తో పాటు ఐకేపీ మహిళ సంఘాల మహిళలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

నిజాంసాగర్: మండలంలోని వెలగనూరు గ్రామంలో మంగళవారం కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి పరిశీలించారు. రైతులకు అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. రైతులు వరి ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎలా ఎంట్రీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. లారీల కొరత ఉందా అని విండో అధ్యక్షున్ని కలెక్టర్ అడుగగా ఎలాంటి లారీలు కొరత లేదని ఆయన సమాధానం ఇచ్చారు. వెలగనూరు గ్రామంలో కుల గణన సర్వే వివరాలను కార్యదర్శి గంగా ప్రసాద్‌తో అడిగి తెలుసుకున్నారు.

అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

బాబా సాహెబ్ అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, ఆయన స్ఫూర్తి విద్యార్థులకు అవసరమని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మంగళవారం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆయన పరిశీలించారు. 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవోదయ పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ విద్యాభ్యాసంలో ముందుకు వెళ్లాలని ఆయన అన్నారు. కలెక్టర్‌కు విద్యార్థులు వందన సమర్పణ చేసి విద్యాలయానికి ఆహ్వానించారు.

ఇసుక తవ్వకాలకు ప్రయత్నాలు

- అధికార పార్టీ నేతల క్వారీల అనుమతికి ప్రభుత్వంపై ఒత్తిడి
- ఇటీవల ఇసుక క్వారీల సాధ్యాసాధ్యాలపై నివేదిక కోరిన టీజీఎండీసీ
- ఇసుక నిల్వలపై త్వరలో సమావేశం కానున్న జిల్లా సాండ్ కమిటీ
- గతంలో జిల్లాలో ఇసుక క్వారీల నిర్వహణలో తీవ్ర వివాదాలు
- అనుమతుల పేరిట అక్రమంగా ఇసుక తవ్వకాలు



మంజీరాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం (ఫైల్)

కామారెడ్డి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మంజీరా నదిలో ఇసుక తవ్వకాలకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు మంజీరాలో ఇసుక క్వారీలకు అనుమతి ఇవ్వాలంటూ ప్రభుత్వంపై, సంబంధిత శాఖ మంత్రులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఇదేక్రమంలో మంజీరాలో ఇసుక క్వారీలకు అనుమతి కోసం సాధ్యాసాధ్యాలపై టీజీఎండీసీ జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులను నివేదిక కోరింది. అయితే ప్రస్తుతం మంజీరాలో నీటి ప్రవాహం కొనసాగుతున్నందున సర్వే చేసే అవకాశాలు లేదు. అయితే అప్పటిలోగా జిల్లా సాండ్ కమిటీ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇస్తుండడంతో జిల్లాలోని ఇసుక క్వారీల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ లభించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఇసుక క్వారీల నిర్వహణలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని గత 4 నెలల కిందట క్వారీల అనుమతులను ప్రభుత్వం రద్దు చేసింది. ఈ వివాదాలను దృష్టిలో ఉంచుకుని మంజీరాలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇస్తుందా లేదా చూడాలి. మరోవైపు ఇసుక తవ్వకాలను చేపడితే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివేదిక కోరిన టీజీఎండీసీ

జిల్లాలోని మంజీరా నది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలకు సంబంధిత శాఖ అధికారుల నుంచి టీజీఎండీసీ నివేదిక కోరింది. తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇసుక తవ్వకాలు చేపడుతోంది. పొరుగు జిల్లా అయిన నిజామాబాద్‌లో మంజీరా నదిలో ఇప్పటికే రెండు ఇసుక క్వారీల నిర్వహణ చేపడుతోంది. ఇందులో భాగంగానే కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలో మంజీరా నదిలో ఇసుక తోడి విక్రయించేందుకు టీజీఎండీసీ కసరత్తు చేస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రైవేట్ నిర్మాణ పనుల అవసరాలకు జిల్లా పరిధిలో మంజీరా నదిలో క్వారీలు ప్రారంభించేందుకు టీజీఎండీసీ గనుల శాఖను నివేదిక కోరింది. ఈ నేపథ్యంలో గనుల శాఖ మంజీరాలో ఇసుక క్వాంటిటి వివరాలపై సర్వే చేయాల్సి ఉంది.

గతంలో అనుమతుల పేరిట అక్రమాలు

మంజీరా నదిలో చెక్‌డ్యాంల నిర్మాణాల పేరిట గత ప్రభుత్వంలో బీర్కూర్, బిచ్కుంద మండలాల పరిధిలోని ఆరు ఇసుక క్వారీలకు అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. సుమారు నాలుగు సంవత్సరాల పాటు ఈ క్వారీల్లో కాంట్రాక్టర్‌లు ఇసుక తవ్వకాలు చేపట్టారు. అయితే ప్రభుత్వ అనుమతుల పేరిట కాంట్రాక్టర్‌లు స్థానికంగా ఉండే కొందరు ఇసుకాసురులు రాజకీయ నేతల అండదండలతో కోట్లు విలువ చేసే ఇసుకను తరలించారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానికంగా ఉండే ఎమ్మెల్యే ఇసుక అక్రమాలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కోట్లు విలువ చేసే అక్రమ ఇసుకను అక్రమార్కులు తరలించినట్లు తెలిసింది. దీంతో ఇసుక క్వారీలను ప్రభుత్వం నిలిపి వేసింది.

ఉమ్మడి జిల్లా అంతటా ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం




కుకునూర్‌లో మానవహారంగా ఏర్పడి రాజ్యాంగం అనే అక్షరాలను ఏర్పర్చిన దృశ్యం



ఆర్మూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు



కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



మద్నూర్‌లో భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బోధన్‌రూరల్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే భారత రాజ్యాంగ పీఠికను తెలుగు, ఆంగ్లంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మంజూష మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ రచనలను, చేసిన కృషిని కొనియాడారు. హక్కులతో పాటు బాధ్యతలు కూడా కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రత్నం, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, గంధపు సాయిలు, దండు రాజ్‌కుమార్, గాండ్ల అబ్బయ్య, అరుణ్ కుమార్, స్వామి, సంగీతరావు, సంతోష్, యాదవ రావు, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. జన వికాస్ సేవ సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జన వికాస్ సేవ సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అందరు గౌరవించాలని, భారతదేశ జాతీయ సమైఖ్యతను కాకాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరుద్దీన్, ప్రసాద్, విజయ్, ప్రవీణ్ శర్మ, గంగాధర్, సబిత, సమత, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో మంగళవారం 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మండల ఎంపీడీవో రాజా శ్రీనివాస్, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెటరవి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, రాజా శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు సుంకెట రవి, నిమ్మ ప్రసాద్, బుచ్చిమల్లయ్య, ఊట్నూర్ ప్రదీప్, సుంకెట శ్రీనివాస్, అజాహరోద్దీన్, ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి గంగజమున, మండల పరిషత్‌కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని సమీకృత భవ నంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం అధికారులు, నాయకులు రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ బావయ్య, ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్, మండల ప్రత్యేక అధికారి దయానంద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం అని లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్ అన్నారు. ఆయన మంగళవారం కళాశాలలో నిర్వహించిన రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం జరిగేలా రాజ్యంగం రచించారని రాజ్యంగం గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని ఆయన తెలిపారు. ఒక సామాన్యుడు ప్రధాని, రాష్ట్రపతి కావడానికి రాజ్యంగంతోనే సాధ్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, లెక్చరర్లు రాజ్యంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్లు ఉపాధ్యాయులు ఉన్నారు.

కామారెడ్డిటౌన్: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వే కమాన్ వద్ద గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి అంబేద్కర్‌యువజన సంఘం నాయకులు నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1949 నవంబరు 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిందని దేశ ప్రజలందరికి న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కల్పించిన రోజు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సంగీమోహన్,నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, వేణుగోపాల్, నరేందర్,శేఖర్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండలంలోని వివిధ గ్రామ పంచాయితీలలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించినట్లు మండల అధికారులు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజా పాలన దినోత్సవాలను జరుపుకోమని తెలుపుగా అందులో భాగంగా గ్రామ పంచాయితీలో సిబ్బందికి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారాం, మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజీద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు ఉన్నారు.

మద్నూర్: దేశ ప్రజలందరికీ న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలను అందిస్తూ రూపొందించబడిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మద్నూర్ బాలుర గురుకుల పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిషోర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రదీప్, గ్రామ నాయకులు మల్లప్ప పటేల్, మొగులాగౌడ్, ఇస్మాయిల్ పటేల్,గంగాగౌడ్, యూసుప్ పటేల్, హాజి, చాంద్, అశోక్, శ్రీను, పాష, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో బారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యంగ నిర్మాణకర్త బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడు కోడెటి శంకర్, న్యాయవాదులు జక్కుల శ్రీధర్, రామకృష్ణ, కిష్టయ్య, సుబాష్, తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్యాలయంలో

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో భారత రాజ్యంగం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శేఖర్, సలీం, అంజనేయులు, పూర్ణమౌళి, వెన్న మోహన్, రాజలింగం, సంపత్, నరేష్, జిన్న, తదితరులు పాల్గొన్నారు.

● మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో

పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భారత రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాచవల్ పెద్ద దేవయ్య, గంగోని స్వామి, తెడ్డు నర్సయ్య, చిన్నయ్య, సాయన్న, గంగారాం, గోపి, శేఖర్, సునంది, పాల్గొన్నారు.

పెర్కిట్: భారత రాజ్యంగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో బీజేపీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, బీజే పీ నాయకులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు అధ్యాపకులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని మోతె, కుకునూర్, వేల్పూర్, పచ్చల నడ్కుడ, పడిగెల, అంక్సాపూర్ , తదితర పాఠశాలల్లో, అలాగే వేల్పూర్ కృష్ణవేణి, రామన్నపేట్ అంబేద్కర్ యువజన సంఘంలో 75వ రాజ్యంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుకునూర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రాజ్యంగం అనే అక్షరాలను ఏర్పర్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పడిగెల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం



పడిగెల పాఠశాలలో స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి తమకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు పడే ఇబ్బందులను స్వయం పాలన దినోత్సవం సందర్భంగా తెలుసుకోగలిగమన్నారు. ప్రధానోపాధ్యాయులుగా విద్యార్థి కె.సుశాంత్, ఉపాధ్యాయులుగా కిరణ్, ఆలుక, స్పందన, గంగప్రసాద్, భరత్, బాబురావు, మనస్విని, లిఖిత, హనిలు ఉన్నారు. స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వచ్చే ఎన్నికలల్లో బీజేపీదే విజయం

● బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి

బోధన్‌రూరల్,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మహరాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధించడం అభినందనీయమని, తెలంగాణలో మళ్లీ వచ్చే ఎన్నికలలో మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని బీజేపీ రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహరాష్ట్రలో అత్యధిక మెజారిటీతో అత్యధిక స్థానాలలో బీజేపీ పార్టీ గెలిచిందని, ఈ సందర్భంగా మహరాష్ట్ర వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో మున్సిపాలిటీ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీ బలోపేతం అవుతుందని, అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జన పోస్టర్ల ఆవిష్కరణ

నందిపేట, నవంబరు26: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం చలో హైదరాబాద్ మాలల సింహగర్జన పోస్టర్లను ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మెన్ అంగిరి ప్రదీప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీనా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్లో మాలల అస్తిత్వం, ఆత్మ గౌరవం, ఐక్యత, అభివృద్ధి, ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ అనుమతితో జరుగుతున్న సింహగర్జనకు ప్రతీ మాలలు తరలి రావాలని ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నందిపేట మండలం జేఏసీ నాయకులు కోమన్‌పల్లి రాజన్న, నాయకులు బోర్రోల్ల సురేష్, సుంకరి నాగరాజు, బంటు రాజేశ్వర్, ఏర్రటి మోహన్, మాయాపూర్ జీవన్, ద్యావతి మురళి, రవి, అశోక్, భూమేష్, విష్ణు తధితరులు ఉన్నారు.

కొత్తపల్లిలో ఘనంగా బీమన్న ఉత్సవాలు

ముప్కాల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బీమన్న ఉత్సవాలు ఆదివాసి నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురం రాజేందర్, సాగర్, శేఖర్, సాయన్న, శివకుమార్, దేవదాస్, రాజేంధర్, చంద్రశేఖర్, శివశంకర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామం లో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం కాం గ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్‌సెల్ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ టక్కరి గంగాధర్‌లు అందజేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సహకారంతో సీఎం రిలిఫ్ ఫండ్ చెక్కులు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డికి లబ్ధిదారులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గట్టుపుతాల నర్సారెడ్డి, మండల బోజన్న, కుర్మ సాయిరాం, ఎంగంటి నెహ్రూ, లింగేశ్వర్, తదితరులు ఉన్నారు.

గిరిజన విద్యార్థిని శైలజ మృతి ప్రభుత్వ హత్యే

● లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్

జక్రాన్‌పల్లి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కొమురభీం జిల్లా వంకాడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని శైలజ మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా ఇదీ ప్రభుత్వ హత్యేనని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్‌చౌహన్ ఆరోపించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థిని మృతిపై హైకోర్టు జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని సహజ మృతి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనబర్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11నెలలు కావస్తున్న ఆశ్రమ పాఠశాలలో, గురుకుల పాఠశాలలో సంక్షేమ శాఖ హాస్టళ్ళను నిర్లక్ష్యం చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులకు దూరం చేయాలనే దురుద్దేశంతో ప్రభుత్వం వ్యవహరిస్తూ తీరును శోచనీయమన్నారు. విద్యార్థిని శైలజ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన విదార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. విద్యార్థిని శైలజ మృతిపై ప్రభుత్వం బాధ్యత వహించాలని లంబాడ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేస్తుందన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానం పొందాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మోకన్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,నవంబరు26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి మంచి ఉన్నత స్థానం పొందాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోరారు. మంగళవారం మండంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐకి చెందిన 85.50లక్షల నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో వేడి నీటి వసతితో పాటు ఫర్నిచర్ అందించాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు నవీపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 15లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించారు. రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కమలాపూర్‌లో 5లక్షల రూపాయలతో చేపట్టిన ఫార్మేషన్ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనా, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మోస్రా సాయినెడ్డి, కోటిరెడ్డి, బాల్‌రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు

తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఆయనను ఉద్యోగులు కలిసి తమ వినతిపత్రాన్ని అందజేశారు. తమ ఉద్యోగాలను వెంటనే రెగ్యులర్ చేయాలని వారు తమ వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారిణి కవిత, సంఘం మండల అధ్యక్షులు రాకేష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

బీజేపీలో చేరిన పద్మశాలి నాయకులు



ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన పద్మశాలి సంఘ నాయకులు

ఆర్మూర్‌రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) ఆర్మూర్ పట్టణానికి చెందిన వివిధ తర్పాల పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షుడు మ్యాక మోహన్‌దాస్, వంగ వివేక్, ఒకటోవ తర్ప అధ్యక్షుడు నూకల నారాయణ, రెండవ తర్ప అధ్యక్షుడు బండి అనంత్‌రావు, నాల్గవ తర్ప అధ్యక్షుడు రుద్ర రాజేశ్వర్, ఏడవ తర్ప అధ్యక్షుడు సదామస్తుల గణపతి, మామిడిపల్లి రెండవ తర్ప మాజీ అధ్యక్షుడు ఎడెల్లి శ్రీనివాస్, అందె నాగేశ్వర్‌రావు, ఏలిగేటి విఠల్, లింగోజి, గణేష్, తదితరులు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



ఆశాజ్యోతి కాలనీలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్

నవీపేట,నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆశాజ్యోతి కాలనీలో జియోటెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్రషర్‌లో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జియోటెక్ క్రషర్‌లో 8.09 సెక్టార్లలో విస్తీర్ణంలో కంకర క్వారీ ఏర్పాటుకు సంబంధించి సమీప గ్రామాలకు చెందిన ప్రజల నుండి అభిప్రాయం సేకరించారు. క్రషర్‌లో కంకర క్వారీ ఏర్పాటుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్థానికులు తమ అభిప్రాయం వెలుబుచ్చారు. ఈ అభిప్రాయ సేకరణలో సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ లక్ష్మణ్ బాబు, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ తెలంగ్ రావు, కంకర క్వారీ యజమాని సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు నసురుల్లాబాద్ గిరిజన గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయ బృందం

నసురుల్లాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్ మాదవరావు మాట్లాడుతూ యూ/10 విభాగంలో ఈశ్వర్ 5వ తరగతి లాంగ్ జంప్‌లో వెండి పతకం, సునీల్‌కు 5వ తరగతి 300 మీటర్స్ పరుగు పందెంలో కాంస్య పతకం, యూ12 విభాగంలో దేవిదాస్ 5వ తరగతి 400 మీటర్ పరుగు పందెంలో బంగారు పతకం, చందర్పన్ 5వ తరగతి 600 మీటర్ల కిడ్స్ జావలిన్ త్రో బంగారు పతకం, రాణా ప్రతాప్ 7వ తరగతి షాట్‌పుట్‌లో బంగారు పతకం, అలాగే లాంగ్ జంప్ పతకం సాధించి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారన్నారు.వీటిని ప్రిన్సిపాల్‌మాధవరావు, వైస్‌ప్రిన్సిపాల్,టీచర్లు, సిబ్బంది, అభినందించారు.

గుర్తుతెలియని శవం లభ్యం

ఆర్మూర్‌టౌన్ నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్ శివారులో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని శవం (55) లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఆయన తెలిపారు. ఎవరైనా గుర్తుపట్టాని యేడల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712659858, 9440140022నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

తాడ్వాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిల్లీలో జరిగిన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలలో భాగంగా రాహుల్ గాంధీ, ఖర్గే, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి గారి ప్రీతంను జిల్లా, మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మద్దెల భాగయ్య, తాడ్వాయి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గైని శివాజీ తదితరులు ఉన్నారు.

పచ్చలనడ్కుడలో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

వేల్పూర్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో నిర్మించనున్న షెడ్డుకు మంగళవారం గ్రామా అధికారులు భూమిపూజ చేశారు. ఈ షెడ్డు నిర్మాణం ఆశల అనిత గారికి మంజూరు చేయడం జరిగిందని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ నవనీత, జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ వనిత, కాంగ్రెస్ నాయకులు గుడాల మోహన్, టక్కరి గంగాధర్, నర్సారెడ్డి, కృపాల్, రాజేంధర్, హన్మాండ్లు, భోజన్న, వంశీ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన సోఫీ

ఎడపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని గ్రామాలలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట వీధి కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయి. వీధి కుక్కల దాడులతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలో వీధి కుక్కలు సోఫీ అనే వ్యక్తిపై దాడి చేయగా అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇది గమనించిన స్థానికులు కుక్కలను వెల్లగొట్టి గాయపడిన వ్యక్తిని బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామాలలో వీధి కుక్కల సమస్య అధికమయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వాటి నివారణకు చర్యలు తీసుకొని కుక్కల దాడుల నుండి మను షులను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టించడం మానుకోవాలి

● మానాల మోహన్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

ముప్కాల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి) బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించి అబద్ధపు మాట్లాడుతున్నారని సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు భయాందోళనకు గురి చేయడం వల్ల రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి వరిధాన్యాన్ని ప్రైవేటు దళారులను నమ్మి పంటను అమ్ముకోవడం జరిగిందని, ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడం వల్ల రైతులు నష్టపోయిన రైతులకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులే నష్టపోయిన రైతులకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నిం చారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి అధైర్యపడ వద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఒక్కొక్కటి పూర్తి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహీనోద్దిన్, వేల్పూర్ మార్కె ట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, ముప్కాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద రవి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మెండోరలో పశువుల షెడ్డుకు భూమిపూజ

భీమ్‌గల్‌రూరల్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోరలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల షెడ్డును మంగళవారం అధికారులు భూమిపూజ చేశారు. ఈ సెడ్డు నిర్మాణానికి లబ్ధిదారుడు నర్సయ్యకు రూ.లక్ష మంజూరు కాగా భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ దివ్యన్, ,రాజేశ్వర్‌గౌడ్, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో స్కూళ్ల పరిశీలించిన

ఆర్మూర్‌టౌన్ నవంబరు26(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మోడల్ స్కూల్, ట్రైబర్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ చీమన్‌పల్లిలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలోని పరిసరాలతో పాటు బాత్‌రూం, వంట గదులను ఆయన పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. పాఠశాలలో కిటికిలు, బాత్‌రూం డోర్‌లను ఎప్పటికప్పుడు రిపేర్ చేయించాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థితో మాట్లాడి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, పూర్ణమౌళి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కోటగిరి: పొతంగల్ మండలంలోని టాక్లీ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో లోల శంకర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో చందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని కేజీబీవి పాఠశాలను మగళవారం రెవెనూ ఇన్స్‌పెక్టర్ సదానంద్ పరిశీలించారు. విద్యార్థుల తరగతి గదులు, వంట గది, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియన్ అసిస్టెంట్ కిరణ్, ఎస్‌వో సంధ్య పాల్గొన్నారు.

భీమ్‌గల్: వసతి గృహంలో వంట ప్రదేశాలలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పట్టణ కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహంఓని వంట శాలలో కూరగాయలు, బియ్యం, పప్పుదినుసులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంట ప్రదేశంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. అలాగే మైనారిటీ పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అజయ్, పవర్ తనిఖీ చేశారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు



ఖేల్

వాలీబాల్ టోర్నీలో తలపడుతున్న విద్యార్థినులు (ఫైల్)



విజ్ఞత, మగ్గిడి



కె.శ్రీనిధి మగ్గిడి

ఆటల్లో మెరికలు.. ఈ అమ్మాయిలు!

- క్రీడా అంశం ఏదైనా.. మైదానంలోకి దిగితే చిరుతలే.
- క్రీడల్లో రాణిస్తున్న ఆర్మూర్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణింపు

ఆర్మూర్ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పొద్దస్తమానం ఆటలేనా..? ఆటలు తిండిపెడతాయా? అని కసురుకునే తల్లి దండ్రులు ప్రతీ ఇంటిలో ఉన్నారు ఎందరో ఉన్నారు. కానీ తమ పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు కూడా ఉన్నారు. ఆటలు తిండిపెడతాయా అని ఈసడించుకున్న తల్లిదండ్రులే తమ పిల్లలు ఆటల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ కీర్తి సంపాదిస్తుంటే మురిసిపోతున్నారు, గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరికలు లాంటి అమ్మాయిలు క్రీడల్లో పాల్గొని రాణిస్తున్నారు. క్రీడా అంశం ఏదైనా వారు మైదానంలో దిగితే చిరుతలే. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధిలోని మగ్గిడి, ఆలూర్, మామిడిపల్లి, మిర్దాపల్లి, పిప్రి, తదితర ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు.

చదువుతో పాటు క్రీడాలకు ప్రాధాన్యత

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాదాన్యత ఇస్తున్నారు. చదువులే కాకుండా కొంత సమయాన్ని ఆటలకు కేటాయిస్తూ పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటున్నారు. బాలురతో పాటు సమానంగా బాలికలు వివిధ క్రీడల్లో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పతకాలు సాధిస్తూ పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకు వస్తున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో క్రీడల్లో పాల్గొని స్పోర్ట్స్ కోటలో ఉద్యోగాలు సాధించిన వారెందరో ఉన్నారు. అలాగే, ఆర్మూర్ మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో విశేషంగా రాణిస్తున్నారు.

ఆలూర్ విద్యార్థుల రాణింపు

అదేవిధంగా ఆలూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన శంకర్‌గౌడ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ప్రతిభను కనబర్చగా.. హ్యాండ్ బాల్‌లో సత్విక్, కీర్తన, అనిత, చిన్నారి, మిత్రేష్‌లు అసమాన ప్రతిభను కనబరిచారు. వీరితో పాటు మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. అంతేకాకుండా పలువురు విద్యార్థులు క్రీడల్లో రాణించడంతో వ్యాయమ ఉపాధ్యాయులు మధు, రాజేష్‌లతో పాటు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందంటున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విజ్ఞత

మగ్గిడి విద్యార్థిని విజ్ఞత. రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటటీలో జిల్లా జట్టుకు నాయకత్వం వహించి రాష్ట్రస్థాయి పోటీలలో మొదటి స్థానం సాధించడంలో కీలక పాత్ర పోషించి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది.



బహుమతి అందుకుంటున్న మగ్గిడి విద్యార్థినులు (ఫైల్)

వాలీబాల్ పోటీలలో దూసుకుపోతున్న శ్రీనిధి

రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలలో మగ్గిడికి చెందిన కె.శ్రీనిధి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. అంతేకాకుండా ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని బరెలీలో జరిగిన జాతీయస్థాయి చాంపియన్ షిప్‌లో రాష్ట్ర జట్టుకు శ్రీనిధి ప్రాతినిథ్యం వహించింది.

తెలంగాణకు సాయిచరణ్ ప్రాతినిథ్యం

అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సాయిచరణ్ జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఇటీవల ఒడిస్సాలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు.

జాతీయస్థాయి టోర్నీకి హిమతేజ్

రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనరిబరిచి హిమ తేజ్ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు ఎంపిక య్యారు. ఇటీవల బరేలిలో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలో పాల్గొని రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిచాంచాడు.



సాయిచరణ్,



హిమతేజ్

ధరణి.. కష్టాలు!!



నసురుల్లాబాద్ రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ధరణి ఆపరేటర్

ధరణి ఆపరేటర్ల వెట్టి చాకిరీ!

- పది నెలలు గడుస్తున్నా.. అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ధరణి ఆపరేటర్లు

నసురుల్లాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ల కోసం ధరణి ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. కాగా వారు సక్రమంగా విధులు నిర్వహిస్తున్న, జీతాలు మాత్రం సమయానికి అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరణి ఆపరేటర్లు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ వెట్టి చాకిరి చేస్తున్న గత పది నెలల నుంచి జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటున్నారు. చాలీ చాలని జీతాలు ఇస్తూ ప్రభుత్వం తమతో వెట్టి చాకిరి చేయించుకుంటుందంటున్నారు. అయినా చాలీ చాలని జీతాలతో తమ జీవితం నెట్టుకొస్తున్నామంటున్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం 2018లో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ మండలానికి ఓ ధరణి ఆపరేర్‌ను నియమించింది. కానీ తమ వేతనాలను థర్డ్ పార్టీ ఏజెన్సీ అందిస్తోందంటున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 671 మంది ధరణి ఆపరేటర్లకు ప్రభుత్వ ఖనాజా నుంచి నెలకు 29,500 వేతనం రాగా, కటింగ్‌లు పోను థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తమ ఖాతాలో కేవలం 12 వేల రూపాయలు మాత్రమే జమ అవుతున్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల బాన్సువాడ డివిజన్ ధరణి ఆపరేటర్లందరూ కలిసి సబ్ కలెక్టర్ దృష్టికి తమ సమస్యను తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ధరణి ఆపరేటర్లకు ప్రభుత్వం ఖాజనా ద్వారా వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

వేతనాలను సక్రమంగా చెల్లించాలి

: సాయిప్రియ, ధరణి ఆపరేటర్, నసురుల్లాబాద్



రాష్ట్ర వ్యాప్తంగా ధరణి ఆపరేటర్లకు గత పది నెలల నుంచి జీతాలు రావడం లేదు. థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వ ఖనాజా నుంచి వేతనాలను సక్రమంగా చెల్లించాలి.

వంతెన నిర్మాణం కలేనా?

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.2.70 కోట్లు మంజూరు
- నిర్మాణంపై నీలినీడలు
- స్థానికులకు తప్పని తిప్పలు
- ఉన్నతాధికారులు దృష్టి సారించేనా?

ఆంధ్రజ్యోతి ఫోకస్



వర్షాకాలం అమర్లబండ ప్రధాన రోడ్డుపై వాగు ప్రవహించే ప్రాంతం



చెరువు అలుగు వద్ద వంతెన నిర్మించాల్సిన స్థలం ఇదే..

సదాశివనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమర్లబండ ప్రధాన వాగులో బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో గ్రామస్థులు ఎన్నో సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ధర్మారావుపేట నుంచి తాడ్వాయి మండలం కన్కల్ వరకు కోట్ల రూపాయలతో 8సంవత్సరాల క్రితం రోడ్డు నిర్మించినప్పటికీ.. పలుచోట్ల బ్రిడ్జిలు అవసరమున్న చోట నిర్మించకపోవడంతో గ్రామస్థుల బాధలు వర్ణణాతీతంగా మారాయి. వాగుపై వంతెన నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.2.70 కోట్లను మంజూరుచేసినప్పటికి ఇంతవరకు పునాది రాయి పడకపోవడంతో అమర్లబండ గ్రామస్థులు ఎన్నో బాధలు ఎదుర్కొంటున్నారు.

వర్షాకాలంలో గ్రామస్థుల ఇబ్బందులు

వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామప్రజలు వాగు ప్రవహిస్తున్న సమయంలో ప్రమాదమని తెలిసిన తప్పని పరిస్థితుల్లో వాగు దాటిల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామానికి ఇతర గ్రామాలతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. గ్రామానికి ఒకే ఒక్కరోడ్డు సౌకర్యం ఉండడం వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తే ఇతర గ్రామాలకు వెళ్లిన వారు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గ్రామానికి ఆనుకొని చెరువు ఉండడంతో కన్కల్ వైపు వెళ్లాలంటే అలుగు ఉధృతి అక్కడ ధర్మారావుపేట వైపు వెళ్లాలంటే వాగు ఉధృతి ఇక్కడ ఉండడంతో ఆపద సంభవించిన చావడమే తప్ప వేరే దారి లేక భయంతో గ్రామస్తులు వర్షాకాలం అన్నిరోజులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిందే. అత్యవసర సమయంలో ప్రాణాలకు తెగించి ఇతరుల సహాయంతో ట్రాక్టర్‌పైన రోడ్డు దాటించడం తప్ప వేరే గత్యంతరం కనిపించదంటున్నారు.

నిధులు మంజూరైన నిరుపయోగమే..

గత ప్రభుత్వంలో ఏడాదిన్నర క్రితం 2.70 కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు ప్రకటించారు. నిధులు మంజూరైనట్లు ప్రకటన రావడంతో గ్రామస్థులు తమ కష్టాలు తొలగనున్నాయని ఆశించారు. కానీ వాళ్ల ఆశలు ఇప్పటికీ నెరవేరకపోవడంతో ఇంకేన్నాళ్ల సమయం పడుతుందని ప్రశ్నలు సంధిస్తున్నారు. వంతెన నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి గ్రామస్థుల ఇబ్బందులపై దృష్టి సారించి బ్రిడ్జి నిర్మాణంపై కార్యాచరణ వేగవంతంచేస్తేనే గ్రామ ప్రజలకు మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



వీసీకి.. అభినందనలు!!

టీయూలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు

డిచ్‌పల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా తెలంగాణ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, బ్యాంకు వచ్చే ఖాతదారులు తమ వాహనాలను ఒకదానివెంట ఒకటి ఇష్టారాజ్యంగా వాహనాలను నిలపడంతో వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు చర్యలకు ఉపక్రమించారు. దీంతో వర్సిటీ సెక్యూరిటీ సిబ్బందితో ద్విచక్రవాహనలు ఒక వైపు, కారులు మరోవైపు ఏర్పాటు చేసేలా చెట్లను చదును చేయించి వాహనాలు ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో తెలంగాణ యూనివర్సిటీ అధికారులు వీసీకి అభినందనలు తెలిపారు.





వర్సిటీ పరిపాలన భవనం వద్ద ఒకవైపు బైకులు, మరోవైపు కార్లు ఇలా..

అతివేగం, అధికలోడుతో అనర్థాలు

- ఇష్టారీతిన నడుస్తున్న మొరం టిప్పర్లు
- అయినా.. పట్టించుకోని అధికారులు
- ప్రమాదాలకు కారణమవుతున్న డ్రైవర్లు
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

తాడ్వాయి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమార్జనే ధ్యేయంగా టిప్పర్ల యజమానులు అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండల కేంద్రంలో మోతాదుకు మించి అధిక లోడ్, అధికవేగంతో టిప్పర్లను తోలుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడుపుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అనుభం లేని డ్రైవర్లు వాహనాలను నడపడంతో పలు ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం బ్రహ్మాజీ వాడి శివారులో మొరం టిప్పర్ బోల్తా పడి మొరం మొత్తంరోడ్డు మీద పడి ప్రయాణీకులకు రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారింది. టిప్పరు బోల్తా పడిన సమయంలో అటు వైపుగా ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. హుటాహుటిన యజమానులు వచ్చి జేసీబీ సహాయంతో మొరంను రోడ్డు కిందకి తీసేశారు. బోల్తా పడిన సమయంలో ఎవరైనా రోడ్డుపై ప్రయాణిస్తే పెద్ద ప్రమాదమే సంభవించేది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని పలువురు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయినా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధిక లోడ్‌తో వెళుతూ అమాయకుల ప్రాణాలతో టిప్పర్ యజమానులు ఆడుకుంటున్నారని పలువురు అంటున్నారు. గతంలో కూడా టిప్పరు ప్రమాదంలో చనిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారు. టిప్పర్ యజమానులు మాత్రం ప్రభుత్వ ఆదాయానికి గండికోటి అక్రమార్గమే ధ్యేయంగా జేబులు నింపుకొని అమాయకుల ప్రాణాతో చెలగాటం ఆడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అనుభవం ఉన్న డ్రైవర్లతో యజమానులు టిప్పర్లను నడిపేటట్లు చూసే విధంగా చేయాలని పలువురు అంటున్నారు.



నివాస గృహాల మధ్యలో నుంచి అధిక లోడ్‌తో వెళుతున్న మొరం టిప్పర్



అతివేగం కారణంగా ప్రమాదానికి గురై ప్రధాన రహదారి మధ్యలోనే అడ్డం పడ్డ మరో టిప్పర్!!

పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి : అదనపు కలెక్టర్


జంగంపల్లిలో వంటగదిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి


తాడ్వాయిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు


లింగంపేటలో కస్తూర్బా పాఠశాలలో..

భిక్కనూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):పాఠశాల ఆవరణను,వంటగదిని ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారంమండలంలోని జంగపల్లి కస్తూరిబా గాంధిపాఠశాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల వంటగదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంటగదిలోకి విద్యార్థులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బీటీఎస్ చౌరస్తాలో గల సౌత్‌క్యాంపస్‌లో నిర్వహిస్తు సర్వే డాటా ఎంటికార్యక్రమం, మండల కేంద్రంలోని నర్సరీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలోమండల ప్రత్యేకాధికారి రజిత, ఎంపీడీఓ రాజ్‌కిరణ్‌రెడ్డి, ఈవో మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని హాస్టళ్లను మండల ప్రత్యేక అధికారిణి రత్నం మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకర్ చారితో కలిసి తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల వసతి గృహంతో పాటు, తెలంగాణ ఆదర్శ కళాశాల వసతి గృహాన్ని, ఎస్సీ బాలుర హాస్టల్‌ను వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రికార్డులను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం మెనూను పరిశీలించారు. వసతి గృహాని విద్యార్థినీతో మాట్లాడి విద్యార్థినీలకు కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి మరుగుదొడ్ల సౌకర్యం, నీటి సదుపాయం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని విద్యార్థినీలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బందికి తెలియపరిచి తగిన వైద్యం చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందజేసే తదితర వంట సామాగ్రిని వారు పరిశీలించారు. విద్యార్థులకు రోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని వసతి గృహాల వార్డెన్‌లకు ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ మహ్మద్, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ గీత, బాలుర హాస్టల్ వార్డెన్ రాములు, ఆదర్శ పాఠశాల వసతి గృహ వార్డెన్ ఉన్నారు.

తాడ్వాయి: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి రాజారామ్ తెలిపారు. ఈయన మంగళవారం మండలంలోని గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని తెలిపారు. అనంతరం మండల అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ప్రత్యేక అధికారి రాజారామ్‌తో కలిసి విద్యార్థులతో భోజనం చేశారు. ఈకార్యక్రమంలో అధికారులు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను డివిజన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గది విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, పాఠశాల ఆవరణ రికార్డులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని పాఠశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రిన్సిపాల్ సావిత్రికి సూచించారు. అనంతరం అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి 75వ భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

● ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని పరిశీలించిన తహసీల్దార్

ఎల్లారెడ్డి ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని తహసీల్దార్ మహేందర్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు గిర్దావర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన రీజినల్ డైరెక్టర్

ఎల్లారెడ్డి పట్టణ శివారులో గల మోడల్ స్కూల్‌ను మంగళవారం రీజినల్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఎంవో రవికుమార్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన ఎలా ఉందని తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలో గల బాలుర వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల తహసీల్దార్ దశరథ్ వార్డెన్‌కు ఆదేశించారు. మంగళవారం ఉదయం వసతి గృహాన్ని సంద ర్శించిన తహసీల్దార్ వంటగదిని పరిశీలించడంతో పాటు విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని మంగళవారం మండల విద్యాశాఖ అధికారి తిరుపతిరెడ్డి సందర్శించారు. పాఠశాలలో బాలికలు హాజరు శాతాన్ని తెలుసుకున్నారు. విద్యాలయంలో 280 మంది బాలికలు హాజరయ్యారని ప్రత్యేక అధికారి సరోజన తెలిపారు. పిల్లలకు అందించే అల్పాహారం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. నాణ్యతతో భోజనాన్ని అందించి క్రమశిక్షణతో బాలికలు ఉండే విధంగాచూడాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

లింగంపేట: లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలను మంగళవారం జిల్లా డీఆర్‌డీవో సురెంధర్, తహసీల్దార్ నరెందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరిలు తనిఖీ చేశారు. వసతి గృహాలలోని సమస్యలను తెలుకుని కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని వారు తెలియజేశారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. వసతి గృహాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు వసతి గృహాల నిర్వహకులను ఆదేశించారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా రెసడెన్షియల్, హాస్టల్‌లల్లో కస్తూర్బా పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మద్నూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా, గురుకుల పాఠశాలలతో పాటు వసతి గృహాలలో విద్యార్థుల భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, గ్రామ పంచాయితీ కార్యదర్శి ఉన్నారు.

రాజంపేట,: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి అపర్ణ సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతోకలిసి మధ్యాహ్నభోజనంచేసి మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తెలిపారు. మరుగుదోడ్ల,త్రాగునీరుప్రభుత్వం సమకుర్చిన సౌకర్యాలు విద్యార్తులకు కల్పించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పూర్ణచందర్‌రావు, ఎంపీడీఓ రఘురాం, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల విద్యాశాఖ అధికారి చందర్ అన్నారు. మంగళవారం నసురుల్లాబాద్ మండలంలోని లింగంపల్లి తండా ప్రాథమిక పాఠశాలతో పాటు నాచుపల్లి మినీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మినీ గురుకులంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినుతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఇంచార్జి ఎంపీడీవో సూర్యకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు రాధ తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

సమావేశమై దీక్ష దివస్‌పై సమీక్ష నిర్వహించారు. ఇవేకాకుండా రుణమాఫీ ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డి ప్రతి పౌరునికి రాజ్యాంగం గురించి పూర్తి అవగాహన ఉండాలి మాండ్ చేస్తున్నాయి. వీటిపై ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తు పూర్వవైభవాన్ని చాటాలని ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. వారం లోగా పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికతో కార్యక్రమాల్లోకి దిగేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జిల్లా వ్యాప్తంగా పార్టీని విస్తరిస్తు స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో సీట్లు గెలుచుకునేందుకు సిద్ధమవుతోంది.

ప్రతీ పౌరుడికి రాజ్యాంగంపై అవగాహన ఉండాలి


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రతి పౌరునికి రాజ్యాంగం గురించి పూర్తి అవగాహన ఉండాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగానికి ఆమోదం తెలిపి నేటికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతారతో కలిసి రాజ్యాంగానికి, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలో అన్నింటికన్న ప్రాముఖ్యమైందని 75 ఏళ్లు గడిచిన ఇంకా పాలన ప్రజాస్వామ్యయుతంగా జరుగుతుందని అంటే రాజ్యాంగం గొప్పతనమని అన్నారు. నేటితరం ప్రతిపౌరునికి రాజ్యాంగం గురించి పూర్తిగా అవగాహన ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీకాంత్,కౌన్సిలర్‌లు నరేందర్, శ్రీనివాస్,నాయకులు భరత్, సురేష్,ఈశ్వర్,వేణు ,వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వర్గీస్ కురియన్ జయంతి



వర్గీస్‌కురియన్ చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న అధ్యాపకబృందం,ఎంపీడీవో

కామారెడ్డిటౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని డెయిరీ కళాశాలలో మంగళవారం వర్గీస్ కురియన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ పాలదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ఉమాపతి మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం పాల ఉత్పత్తి రంగంలో మొదటిస్థానంలో చేరడంలో వర్గీస్ కురియన్ పాత్ర ఎనలేనిదని అన్నారు.పాల ఉత్పత్తుల రంగాన్ని పెంచడం ఎస్ఎండీ లక్ష్యమని పాడిపరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం 30 సంవత్సరాలలో పాడి పరిశ్రమ స్థిరమైన గ్రామీణ ఉపాధి రంగంగా మార్చడానికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి ఎంపీడీఓ నాగవర్ధన్, అధ్యాపకులు మాధవి,శైలజ, శ్రీనివాస్,సురేందర్, స్వాతి,శరత్‌కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ట్యాక్స్‌లో గందరగోళం

బాన్సువాడటౌన్ , నవంబరు 26 : బాన్సువాడ మున్సిపల్ ట్యాక్స్‌ను అమాంతంగా పేంచేసి ప్రజలను గందరగోళంలోకి నెట్టేసారని బీజేపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడు సంవత్సరాల క్రితం భువన్ సర్వే నిర్వహించి 100 రూపాయలు ఉన్న ట్యాక్స్‌ను వెయ్యి రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. తూతూ మంత్రంగా భువన్ సర్వే నిర్వహించి పేద , మధ్యతరగతి వారి నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. పూర్తి స్థాయిలో భువన్ సర్వే నిర్వహించి ప్రజలు నష్టపోకుండా ట్యాక్సులు విధించాలని , లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ , జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్ , అసెంబ్లీ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్ , సీనియర్ నాయకులు కోనాగ గంగారెడ్డి తదితరులున్నారు.

ఘనంగా సంవిధాన్ దివస్

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోనరి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కార్యాలయ సిబ్బంది సంవిధాన్ దివాస్‌ను ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ లత అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. 2015 నుంచి ప్రతియేటా రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నాగిరెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద ఆత్మకూర్ గ్రామంలోనరి మజీద్ గల్లీలో ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.4లక్షల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీదర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సుభాష్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వసంత్‌రెడ్డి, అబేద్, పాషా, షాదుల్‌బాబా, అబ్దుల్ నయ్యూం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఎదుగుదలకు విద్య ప్రధాన ఆయుధం

● బాన్సువాడ జూనియర్ సివిల్ న్యాయాధికారి కుమారి భార్గవి

బాన్సువాడటౌన్, నవంబరు 26: ఒక వ్యక్తి ఎదుగుదలకు విద్యయే ప్రధాన ఆయుధమని బాన్సువాడ జూనియర్ సివిల్ న్యాయాధికారి కుమారి భార్గవి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ , న్యాయసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భారతదేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, గ్రూప్ హెల్పింగ్ ఫ్రెండ్స్ వ్యవస్థాపకుడు నరేష్ రాథోడ్ , అధ్యక్షుడు సురేష్ , తార్య , దేవి , భాస్కర్ , శ్రీకాంత్ తదితరులున్నారు.

చైర్‌పర్సన్‌ను కలిసిన ఇన్‌-చార్జి కమిషనర్


చైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జ్ కమిషనర్

కామారెడ్డిటౌన్,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ ఇంచార్జ్ కమీషనర్‌గా నియామకమైన ఎల్లారెడ్డి మున్సిపల్ కమీషనర్ శ్రీహరి మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియచంద్రశేఖర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌మాట్లాడుతూ కామారెడ్డి పట్టణంలో శానిటేషన్,అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించేలా కమీషనర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.అదేవిధంగా మున్సిపల్‌లోని ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలపై కమీషనర్ తగిన విధంగా స్పందించాలని అందుకు తమ సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వంశీ,పాత శివకృష్ణమూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సౌత్ క్యాంపస్ అభివృద్ధికి పూర్తి సహకారం'

భిక్కనూరు,నవంబరు 26(ఆంధ్రజ్యోతి):సౌత్‌క్యాంపస్ అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో ఉన్న సౌత్‌క్యాంపస్‌లో తన సొంత నిధులతో నిర్మించిన బహిరంగ వేదిక నిర్మాణాన్నివీసీ యాదగిరిరావుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ గుర్తింపుకొరకు జరిగే అన్ని కార్యక్రమాల్లో తనవంతు పూర్తిసహకారం ఉంటుందన్నారు. అనంతరంవీసీ యాదగిరిరావు మాట్లాడుతూ సౌత్‌క్యాంపస్ అభివృద్ధికి సహకరిస్తున్న పైడి ఎల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజిస్టర్ యాదగిరి, ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, క్యాంపస్ అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కుల కోసం లబ్ధిదారులు ఎవరికి డబ్బులివ్వొద్దు

ఎల్లారెడ్డి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్‌కు అప్లై చేసిన వారికి డబ్బులు పంపితే మీ చెక్ మీకు పంపిస్తాము అని కాల్స్ వస్తున్నాయని, మీరు ఎవరికి ఎలాంటి డబ్బులు ఇవ్వనవసంర లేదని మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఫేక్ కాల్స్‌కి ఎవరూ రెస్పాన్స్ కావద్దని, డబ్బులు ఇవ్వమని ఏదైనా నెంబర్ నుంచి కాల్ వస్తే వెంటనే క్యాంపు ఆఫీస్‌లో ఫిర్యాదు చేయాని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు శృతి ఎంపిక

గాంధారి,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 19 బాలికల కబడ్డీ పోటిలకు గాంధారి మండలం గౌరరారంకలాన్‌కు చెందిన శృతి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు సత్యం తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ టీమ్‌కు సెలక్ట్ అయిందని తెలిపారు.రంగారెడ్డి జిల్లా ఇంజాపూర్‌లో జరిగిన పోటిల్లో నిజామాబాద్ జిల్లా జట్టు తృతియ స్థానం సాధించిందని తెలిపారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ అనిల్ తెలిపారు. రాజంపేట మండలంలోని కొండాపూర్ గ్రామంలో మంగళవారం మహిళ సమైక్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన, గర్భిణీ,బాలింతలు, న్యూట్రిషన్ పిల్లల గురించిప్రతి ఒకరు మరుగుదొడ్డి వాడాలని అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కల్గిఉండాలని వివరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామసంఘ కోశాధికారి సంగమణి, సీసీ, వీవోఏ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక నిర్మాణ పనుల ప్రారంభం

రాజంపేట,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల కేంద్రంలోని ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మహిళ భరోసా ఉపాధి పథకంలో పశువుల పాక నిర్మాణ పనులను ప్రారంభించినట్లు మండల ప్రత్యేకాధికారి అపర్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజంపేట గ్రామానికి చెందిన కుమ్మరి అనసూయ పశువుల పాకను ఉపాధి పథకం ద్వారా ఏర్పాటుచేశామని అన్ని గ్రామాలలో అగ్రికల్చర్ ఫారంపండ్, భూమి అభివృద్ధి పనులు, నర్సరీ వంటి పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, ఎపీఎం సాయిలు, ఏపీఓ సక్కుబాయి, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, రాజు, సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి

నసురుల్లాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ ఒకటిన మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలని నసురుల్లాబాద్ మండల కేంద్రంలో మంగళవారం రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం మాలల సింహ గర్జన కరపత్రాలను మాల సంఘం నాయకులు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో నసురుల్లాబాద్ అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షులు మామిడి భూమయ్య, కిరణ్, రాములు, భరత్, భావవ్వ తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర్‌లో మొక్కలు నాటిన అధికారులు

దోమకొండ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రజాపాలన ప్రజా దినోత్సవం సందర్భంగా మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో రజని, టీఏలు లింగం, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు యాదగిరి, పద్మ, పీల్డ్ అసిస్టెంట్‌లు లింగం, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్

ఎల్లారెడ్డి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని సోమార్‌పేట్ రోడ్డు పక్కన నూతనంగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్ళ వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను యుద్ద ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్‌కు సూచించారు. పెండింగ్ పనులుపూర్తి కాగానే లబ్దిదారులకు ఇండ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

ఆదర్శ పాఠశాల సందర్శన

నిజాంసాగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట ఆదర్శ పాఠశాల ఆర్‌జేడీ అధికారులు మంగళవారం సందర్శించారు. అధికారులు తరగతి గదిలోనికి వెళ్లి విద్యార్థుల విద్యాభ్యాసం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి నైపుణ్యాలను అనుగుణంగా విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పాఠశాలలో రికార్డులను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అధికారుల బృందంలో ఆర్‌జేడీ వరంగల్ జిల్లాకు చెందిన సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆదర్శ పాఠశాలలు దుర్గ ప్రసాద్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల విద్యాశాఖ అధికారులు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తదితరులు ఉన్నారు.

మహిళలను సంఘాలల్లో చేర్పించాలి

బీర్కూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏ గ్రూపులలో లేని మహిళలను గుర్తించి సంఘాలలో చేర్పించాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గంగాధర్ మాట్లాడుతూ ఐకేపీ సిబ్బంది గ్రామాలలో ఏ గ్రూపులో లేని సభ్యులను గుర్తించి సంఘాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమని, అన్ని గ్రామాల అధ్యక్షురాళ్ళు, సీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మొక్కజొన్న జూల్లు దగ్ధం

తాడ్వాయి,నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తాడ్వాయి గ్రామానికి చెందిన గైని చంద్రంకు చెందిన మొక్కజొన్నజూల్లు కలాన్ శివారులో విద్యుత్ షాక్ సర్క్యూట్ తగిలి దగ్ధం అయినట్లు బాధితుడు తెలిపారు.సుమారు30వేల ఆస్తి నష్టం జరిగింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని తెలిపారు. హుటాహుటిన ఫైర్ ఇంజన్ వచ్చి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.


దగ్ధం అవుతున్న జూల్లును ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలి

సదాశివనగర్,నవంబరు26 (ఆంధ్ర జ్యోతి):దేశంలో మహిళలపై ప్రతి పదినిమిషాలకు ఒక హింస జరుగుతుందని ఇన్స్ పైర్ సొసైటీ ఫర్ రూ రల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు రవళి తెలి పారు. మంగళవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్త్రీల పై, బాలికలపై జరుగుతున్న హింసను ఎదుర్కోండి అనే నినాదంతో 15 రోజుల కార్యక్రమాలలో భా గంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికి ఇంకా మహిళలపై దాడులు జరుగుతున్నాయని,ఎప్పుడైతేకుటుంబంలోని తోటి సొదరిమణుల మాదిరి ఇతర మహిళలతో నడుచుకోవడం బాధ్యతగా తీసుకుంటేనే సమాజంలో మార్పు వస్తుందని అన్నారు. మహిళల సంరక్షణార్థం ఎన్ని చట్టాలు తీసుకువచ్చిన వాటిని సరైన సమయంలో ఉపయోగించకపోతే మహిళలపై దాడులు పెరిగిపోతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అజ్మల్‌ఖాన్, సంస్థ ప్రతినిధి విఠల్‌రావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు రవళి

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- దేవకీ నందన వాసుదేవ
దర్శన్	- జీబ్రా
ప్రియ 35	- అమరన్
ప్రియ 70	- మెకానిక్ రాకీ

బాన్సువాడ

మహేశ్వరి	- మెకానిక్ రాఖీ
వెంకటేశ్వర	- కేసీఆర్(కేశవ చంద్ర రమావత్)

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190